తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
సోమవారం
14 సెప్టెంబర్ 2026

## భక్తిశ్రద్ధలతో... ప్రశాంతంగా వినాయక చవితి ఉత్సవాలు

- మండపాల నిర్వాహకులు పోలీస్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి
- ఆన్‌లైన్‌లో మండపాల నమోదు తప్పనిసరి.. డీజేలు, అధిక శబ్దానికి అనుమతి లేదు
- అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112కు సమాచారం ఇవ్వాలి
- జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు



**మెదక్, సెప్టెంబర్ 13 (జనంసాక్షి):** వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ప్రజలకు సూచించారు. మండపాల నిర్వాహకులు పోలీసుశాఖ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు.
జిల్లాలో వినాయక మండపాలు ఏర్పాటు చేసేవారు పోలీసుశాఖకు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసి అనుమతి పొందాలని తెలిపారు. మండప స్థలం, నిర్వాహకులు, కమిటీ సభ్యులు, ఫోన్ నంబర్లు, ప్రతిష్ఠాపన, నిమజ్జనం తేదీ, సమయం, ప్రదేశం, వాహనం, వాలంటీర్ల వివరాలను నమోదు చేయాలన్నారు. ఇబ్బందులు ఉంటే సమీప పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు.
పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాలకు ప్రాధాన్యం ఇవ్వాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా మండపాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. సంబంధిత శాఖల అనుమతులు తీసుకోవడంతో పాటు విద్యుత్ వైరింగ్‌లో భద్రతా ప్రమాణాలు పాటించాలన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా క్యూలైన్లు, వాలంటీర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. మండపాల వద్ద పాయింట్ పుస్తకం ఉంచి పోలీసుల తనిఖీల వివరాలను నమోదు చేయాలన్నారు.
మండపాల వద్ద 24 గంటలు కనీసం ముగ్గురు వాలంటీర్లు అందుబాటులో ఉండాలని, రాత్రివేళ ఒకరు మేల్కొని ఉండేలా చూడాలన్నారు. డీజేలు, అధిక శబ్దంతో లౌడ్‌స్పీకర్లకు అనుమతి లేదని, శబ్ద కాలుష్యంతో ప్రజలు, వృద్ధులు, చిన్నారులు, విద్యార్థులకు ఇబ్బందులు కలిగించరాదన్నారు. యువత క్రమశిక్షణతో వ్యవహరించాలని కోరారు.
విగ్రహాల ప్రతిష్ఠాపన నుంచి నిమజ్జనం వరకు పోలీసులు 24 గంటలు అప్రమత్తంగా ఉంటారని ఎస్పీ తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112కు సమాచారం ఇవ్వాలని సూచించారు.
ఆన్‌లైన్ మండపాల నమోదు: policeportal.tspolice.gov.in

## జాతీయ మెగా లోక్‌అదాలత్‌కు అపూర్వ స్పందన

- 3,793 కేసుల్లో రాజీ..
- సైబర్ బాధితులకు రూ.50.13 లక్షలు అందజేత
- జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్



**సంగారెడ్డి, సెప్టెంబర్ 13 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లాలో నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌కు అపూర్వ స్పందన లభించింది. జిల్లా వ్యాప్తంగా రాజీకి అవకాశం ఉన్న 819 ఐపీసీ కేసుల్లో ఇరువర్గాల మధ్య రాజీ కుదిర్చగా, మరో 1,135 ఈ-పెట్టి, 1,839 డీడీ కేసుల్లో న్యాయపరమైన పరిష్కారం లభించినట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. సైబర్ నేరాలకు సంబంధించి నమోదైన 58 కేసుల్లో రూ.43.50 లక్షలు, ఎఫ్ఐఆర్ నమోదు కాని మరో 73 కేసుల్లో రూ.7.80 లక్షలు బాధితులకు తిరిగి అందేలా కోర్టు అనుమతులు పొందినట్లు వెల్లడించారు.
ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. క్షణికావేశంలో జరిగే తప్పులను సరిదిద్దుకునేందుకు లోక్‌అదాలత్ మంచి అవకాశమన్నారు. అనవసర గొడవలకు వెళ్లి జీవితాలను ఇబ్బందుల్లోకి నెట్టుకోవద్దని సూచించారు. రాజీ మార్గమే రాజమార్గమని, అవకాశం ఉన్న కేసుల్లో ఇరువర్గాలు రాజీకి రావడం ఉత్తమమని పేర్కొన్నారు.
లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయడంలో అంకితభావంతో పనిచేసిన జిల్లా పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. వర్టికల్ డీఎస్పీ సురేందర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ రమేష్, డీ4సీ డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి, అనుసంధాన అధికారి ఎస్ఐ సత్యనారాయణ, న్యాయస్థాన విధుల అధికారులు, సైబర్ విభాగం సిబ్బందిని ప్రత్యేకంగా ప్రశంసించారు.

## విఘ్నాలు తొలగి సుఖసంతోషాలు కలగాలి

- జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్



**మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 13 (జనంసాక్షి):** 14-09-2026 సోమవారం గణేష్ చతుర్థి సందర్భంగా జిల్లా ప్రజలందరికీ జిల్లా కలెక్టర్ ప్రతి మాసింగ్ శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నేశ్వరుని కృపతో విఘ్నాలన్నీ తొలగి, అందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు. జిల్లాలో ప్రజలందరూ ఈ పండుగను సంతోషంగా, భక్తితో జరుపుకోవాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ... గణపతి ఆశీర్వాదాలతో జిల్లాలో ప్రతి ఒక్కరికి సుఖ సంతోషాలు, శాంతి, ఆర్థిక స్థితి మెరుగుపడాలని ఆకాంక్షించారు. పర్యావరణ రక్షణ కోసం మట్టి గణేష్ విగ్రహాలను వినియోగించుకోవాలని, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను నిషేధించి, నీటి కాలుష్యం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గణేష్ విగ్రహాల నిమజ్జనం సమయంలో స్వచ్ఛత, క్రమశిక్షణ పాటించాలని, ప్రభుత్వానికి సహకరించాలని ప్రజలను కోరారు. నిమజ్జనానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రాంతాల్లోనే నిమజ్జనం చేయాలని ప్రజలకు తెలిపారు. ప్రజలందరూ ఐకమత్యంతో, ప్రశాంత వాతావరణంలో పండుగను జరుపుకోవాలని కలెక్టర్ తెలిపారు.

## వినాయక విగ్రహాల ఏర్పాటుకు పోలీసు అనుమతి తప్పనిసరి

- జిల్లా ఎస్పీ సునిత రెడ్డి



**వనపర్తి, సెప్టెంబర్ 13 (జనంసాక్షి):** వినాయక చవితి సందర్భంగా జిల్లాలో గణేష్ మండపాల్లో విగ్రహాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసు శాఖకు సమాచారం అందించి అనుమతి పొందాలని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి తెలిపారు. ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహిస్తూ పోలీసుశాఖ సూచనలు, నిబంధనలు పాటించాలని కోరారు.
మండపాల ఏర్పాటుకు సంబంధిత శాఖల అనుమతులు తీసుకోవడంతో పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ కనెక్షన్ల విషయంలో నాణ్యమైన వైరును వినియోగించి షార్ట్‌సర్క్యూట్ ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.
మండపాల వద్ద కమిటీ సభ్యులు, వాలంటీర్ల వివరాలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని, భక్తుల కోసం క్యూలైన్లు, తగినంత మంది వాలంటీర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. మండపాల వద్ద పాయింట్ పుస్తకం తప్పనిసరిగా ఉంచాలన్నారు. పెద్ద శబ్దాలతో కూడిన లౌడ్‌స్పీకర్లు, డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు.
మండపాల వివరాలను https://policeportal.tspolice.gov.inలో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని, ఆన్‌లైన్‌లో నమోదు సాధ్యం కాని వారు సమీప పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 లేదా 112కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

### కాట్రియాలలో సందడిగా

## క్రికెట్ కేపీఎల్ సీజన్-4 ప్లేయర్స్ ఆక్షన్

- 2027 సంక్రాంతి క్రికెట్ సమరానికి రంగం సిద్ధం
- యువతను క్రీడల వైపు ప్రోత్సహించడమే కేపీఎల్ లక్ష్యం : నిర్వాహకులు




**రామాయంపేట, సెప్టెంబర్ 13 (జనంసాక్షి):** రామాయంపేట మండలం కాట్రియాల గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నిర్వహించనున్న 2027 కేపీఎల్ సీజన్-4 క్రికెట్ టోర్నమెంట్‌కు సంబంధించిన ప్లేయర్స్ ఆక్షన్ ఆదివారం రైతు వేదికలో ఉత్సాహభరితంగా కొనసాగింది. ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా కేపీఎల్‌ను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఐదు జట్లతో జరగనున్న ఈ టోర్నమెంట్‌కు సంబంధించి ఆటగాళ్ల ఎంపిక కోసం నిర్వ హించిన ఆక్షన్‌లో టీం ఓనర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కేపీఎల్ నిర్వాహకులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత యువతను క్రీడల వైపు ప్రోత్సహించడంతో పాటు వారిలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడమే కేపీఎల్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. 2027 సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామంలో నిర్వహించే క్రికెట్ పోటీలు యువతలో నూతన ఉత్సాహాన్ని నింపడంతో పాటు స్నేహభావం, ఐక్యతను పెంపొందిస్తున్నాయని పేర్కొన్నారు. క్రీడలపై యువతలో ఆసక్తి పెంచేందుకు కేపీఎల్ ఒక మంచి వేదికగా నిలుస్తోందన్నారు.

## మూడవ వార్డులో 2.50 కోట్లతో బీటీ రోడ్డు కం బ్రిడ్జి ప్రారంభం





**మక్తల్, సెప్టెంబర్ 13 (జనంసాక్షి):** మక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని మూడవ వార్డులో ప్రజల చిరకాల వాంఛ నెరవేరింది. పట్టణంలోని మూడవ వార్డులో రూ.2.50 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన బీటీ రోడ్డు కం బ్రిడ్జిని రాష్ట్ర అబకారీ, పర్యాటక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ప్రారంభించారు. ?ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ పట్టణాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని స్పష్టం చేశారు. స్థానిక ప్రజలకు రాకపోకలలో ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించడమే లక్ష్యంగా ఈ రహదారి, వంతెన నిర్మాణ పనులను పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు, రోడ్లు, డ్రైనేజీలు, బ్రిడ్జిల వంటి అన్ని అభివృద్ధి పనులను దశలవారీగా వేగవంతం చేస్తామని హామీనిచ్చారు. నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని, మక్తల్ పట్టణాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం శ్రమిస్తామని మంత్రి పేర్కొన్నారు. నూతనంగా బీటీ రోడ్డు కం బ్రిడ్జి అందుబాటులోకి రావడంతో మూడవ వార్డు ప్రజలు తమ హర్షాతిరేకాలను వ్యక్తపరిచారు. దశాబ్దాలుగా ఉన్న రవాణా ఇబ్బందులు తొలగిపోయాయని ఆనందం వ్యక్తం చేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రితో పాటు మక్తల్ మున్సిపల్ చైర్ పర్సన్ వాకిటి మానస హనుమంతు, మంత్రి సతీమణి వాకిటి లలిత, బాలకృష్ణారెడ్డి, కోళ్ల వెంకటేష్, మున్సిపాలిటీ కౌన్సిలర్లు, వివిధ వార్డుల ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నారాయణఖేడ్ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు


• **మహారెడ్డి భూపాల్ రెడ్డి (మాజీ శాసనసభ్యులు)**



**కల్హేర్ సెప్టెంబర్ 13(జనంసాక్షి):** తొలి పూజలందుకునే ఆదిదేవుడు, విఘ్నాలను తొలగించి విజయాలను ప్రసాదించే వినాయకుని జన్మదినమైన వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని నారాయణఖేడ్ నియోజకవర్గంలోని నా అభిమాన ప్రజలందరికీ, అన్నదమ్ములకు, అక్కచెల్లెళ్లకు, అవ్వాతలకు, యువతీ యువకులకు, రైతు సోదరులకు, ప్రజాప్రతినిధులకు, నాయకులకు, కార్యకర్తలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు హృదయపూర్వక వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. ఆ గణనాథుని చల్లని చూపులు, దివ్య ఆశీస్సులు మన నియోజకవర్గ ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని, ప్రతి ఇంటా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలు వెల్లివిరియాలని, ప్రతి రైతు కుటుంబం పాడిపంటలతో, సిరిసంపదలతో తులతూగాలని, మన యువతకు మంచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని, మన నారాయణఖేడ్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దేశంలోనే ఆదర్శంగా నిలవాలని ఆ విఘ్నేశ్వరుడిని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాను. ఈ పండుగ మనందరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని, మన మధ్య ఐక్యత, సోదరభావం, ప్రేమానురాగాలు మరింత పెంపొందాలని, అందరం కలిసికట్టుగా నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేయాలని కోరుకుంటున్నాను. గతంలో మీరు నాపై చూపిన ప్రేమాభిమానాలు, అండదండలు ఎప్పటికీ మరువలేనివి. మీ ఆశీస్సులు, ఆదరణ ఇలాగే కొనసాగాలని ఆకాంక్షిస్తున్నాను. మరొక్కసారి నియోజకవర్గ ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు. మహారెడ్డి భూపాల్ రెడ్డి మాజీ శాసనసభ్యులు.

## వర్షానికి కూలిన ఇల్లు..సామాగ్రి ధ్వంసం..

• **ఆదుకోవాలని బాధితుల విజ్ఞప్తి**



**శివ్వంపేట సెప్టెంబర్ 13 (జనంసాక్షి):** ఆదివారం తెల్లవారు జామున మండల కేంద్రమైన శివ్వంపేటలో ఆకస్మికంగా కురిసిన వర్షానికి జర్నలిస్ట్ సంపత్ కుమార్ ఇల్లు పూర్తి గా ధ్వంసమైంది. ఒక్కసారిగా భారీ వర్షం కారణంగా ఇంటి పైకప్పు ఒక్కసారిగా కూలిపోయింది. దీంతో ఇంట్లో ఉన్న బట్టలు, నిత్యావసర సరుకులు, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఇతర గృహోపకరణాలు పూర్తిగా తడిసి ధ్వంసమయ్యాయి. అదృష్టవశాత్తు ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. నివాసం ఉండేందుకు స్థలం లేక బాధిత కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. జరిగిన నష్టంతో వారు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. విషయం తెలుసుకున్న స్థానికులు, చుట్టూ పక్కాల వారు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. సంబంధిత రెవెన్యూ శాఖ అధికారులు వెంటనే స్పందించి, జరిగిన నష్టాన్ని అంచనా వేసి, ప్రభుత్వం ద్వారా తగిన పరిహారం అందించి జర్నలిస్ట్ కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు, జర్నలిస్టులు విజ్ఞప్తి చేశారు.

## శ్రీవైష్ణవ సంఘ అభివృద్ధికి కృషి



**తూప్రాన్, సెప్టెంబర్ 13 (జనంసాక్షి):**
చాత్తాద శ్రీ వైష్ణవ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర అధ్యక్షుడు అశ్వాపురం వేణుమాధవ్ తెలిపారు. తూప్రాన్‌లో సంఘ పాలకమండలి పర్యటన సందర్భంగా ఆయన మాట్లాడారు. సంఘం ఆధ్వర్యంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై స్థానిక ప్రతినిధులతో చర్చించారు. ఈ సందర్భంగా తూప్రాన్ శాఖ ప్రతినిధులు శ్రీ కూర్మ నరసింహ స్వామి ఆలయ అభివృద్ధిపై రాష్ట్ర అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ఆలయానికి వెళ్లే రహదారి నిర్మాణం చేపట్టాలని కోరగా, వేణుమాధవ్ సానుకూలంగా స్పందించి తన సొంత ఖర్చులతో రహదారి నిర్మాణం చేపడతానని హామీ ఇచ్చారు.

కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట యోగి వెంకటేశ్వర్లు, ఆర్థిక కార్యదర్శి వరయోగుల రవీందర్, సంప్రదాయ కార్యదర్శి పుల్ల ఖండం ఉపేంద్ర స్వామి, ఆర్గనైజింగ్ సెక్రటరీ పరివేద వెంకటేశ్వర్లు, ఇతర రాష్ట్ర, జిల్లా, తూప్రాన్ శాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ రాంపూర్ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడి ఎన్నిక



**చేర్యాల, సెప్టెంబర్ 13(జనంసాక్షి):** చేర్యాల మండలం రాంపూర్ గ్రామంలో జనగామ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఆదేశాల మేరకు చేర్యాల మండల అధ్యక్షులు మంజ మల్లేశం ఆధ్వర్యంలో ఆదివారం గ్రామ కాంగ్రెస్ కమిటీనీ ఎన్నుకున్నారు. గ్రామ శాఖ అధ్యక్షులుగా రంగు తిరుపతి గౌడ్, ఉపాధ్యక్షులుగా శెవల్ల చిన్న రాజయ్యలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాంపూర్ సర్పంచ్ శెట్టె కొమురయ్య,జిల్లా జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అందె నానిబాబు, మండల ప్రధాన కార్యదర్శి శవల్ల రాజయ్య, మండల కార్యదర్శిలు తాటికొండ సదానందం, కోయినేని నరసయ్య, ఎండి. ఖాళీం పాషా, కరెడ్ల చింటు పాల్గొన్నారు.

## మట్టి గణపతులను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

• **ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో విగ్రహాల పంపిణీ**



**చేర్యాల, సెప్టెంబర్ 13(జనంసాక్షి):** మట్టి గణపతులనే పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం అనే నినాదంతో పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.

చేర్యాల పట్టణ కేంద్రంలో వినాయక చవితి సందర్భంగా పర్యావరణహిత వేడుకలను ప్రోత్సహించే ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ యువజన సంఘం తరపున చేర్యాలలో మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమం చేపడుతున్నట్లు సంఘం నాయకులు తెలిపారు.

ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారైన విగ్రహాలు నీటి వనరులను కలుషితం చేస్తాయని, అందుకే సాంప్రదాయ మట్టి విగ్రహాలను పూజించాలని సంఘం నాయకులు పిలుపునిచ్చారు. మట్టి విగ్రహాలు సులభంగా నీటిలో కరిగిపోయి పర్యావరణానికి ఎలాంటి హాని కలిగించవని వారు వివరించారు.

## వినాయక నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతున్న మండపాలు...



**పెద్ద శంకరంపేట్, సెప్టెంబర్ 13 (జనంసాక్షి):** వినాయక చవితి పండుగను పురస్కరించుకొని పెద్ద శంకరంపేటతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో వినాయక నవరాత్రి ఉత్సవాల నిర్వహణ కోసం వినాయక మండపాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. యువజన సంఘాల ఆధ్వర్యంలో.. పలు ఆలయాలలో గ్రామాలలో వాడ వాడల పలు ప్రధాన ప్రాంతాలలో వినాయక మండపాల పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

కొత్త కొత్త సెట్టింగ్‌లతో ఒకరికి మించి ఒకరు వినాయక మండపాలను విద్యుత్ దీపాలతో దేవతమూర్తుల సెట్టింగ్లతో ఎంతో అందంగా అలంకరిస్తున్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాలను ఎంతో వైభవంగా నిర్వహించేందుకు ఆయా మండపాల నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాలలో ప్రజలు ఆయా మండపాలను దర్శించుకుని వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించేలా చర్యలు చేపడుతున్నారు.

## నూతన అభివృద్ధి కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



**జడ్చర్ల, సెప్టెంబర్ 13 (జనంసాక్షి):** మున్సిపాలిటీ పరిధిలోని బాదేపల్లి చైతన్యనగర్ శ్రీ బంగారు మైసమ్మ దేవాలయ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆలయ అభివృద్ధి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నల్ల కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా చెన్నయ్య, కోశాధికారిగా శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా కృష్ణయ్య, రాజు, జయరాజ్, సహాయ కార్యదర్శిగా మల్లికార్జున్, గౌరవ అధ్యక్షుడిగా శంకర్ బాబు ఎన్నికయ్యారు. గౌరవ సలహాదారులుగా రంజిత్ బాబు, రామచంద్రయ్య, దశరథం, చెన్నయ్య, శివకుమార్, ఉమా శంకర్ గౌడ్, నందకిషోర్ గౌడ్, శంకర్, శ్రీనివాసులు, వెంకటస్వామి గౌడ్, రవి గౌడ్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా రవి పాల్గొన్నారు.

## 125 రోజుల ఉపాధి హామీ పథకం ఒక నాటకం: ఏఐవైఎఫ్



**కోహెడ, సెప్టెంబర్ 13 (జనంసాక్షి):** ఉపాధి హామీని 125 రోజులకు పెంచామని కేంద్ర ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, వాస్తవానికి పేదలపై భారం మోపే విధానాలను అమలు చేస్తోందని ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి కందుకూరి మహేష్ విమర్శించారు. ఎం ఎన్ఆర్ఈజీఎస్‌కు బదులుగా కేంద్రం తీసుకొచ్చిన విబీ-జీ రామ్‌జీ చట్టం శ్రామిక వర్గ హక్కులపై దాడి చేసే విధంగా ఉందన్నారు. ఉపాధి హామీ ప్రభుత్వ దయాదాక్షిణ్యం కాదని, శ్రమజీవుల న్యాయబద్ధమైన హక్కని పేర్కొన్నారు.

కొత్త చట్టం ప్రకారం కేంద్రం-రాష్ట్రాల మధ్య 60:40 నిధుల వాటా విధానం అమలుతో ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్రాలపై అదనపు భారం పడుతుందని అన్నారు. గతంలో నైపుణ్యం లేని కూలీల వేతనాలను కేంద్రం పూర్తిగా భరించేదని, ఇప్పుడు రాష్ట్రాలపై బాధ్యత మోపడం వల్ల నిధుల కొరత పేరుతో పనిదినాలు తగ్గే ప్రమాదం ఉందన్నారు. కాగితాలపై 125 రోజులు ఉన్నా క్షేత్రస్థాయిలో ఉపాధి అవకాశాలు తగ్గవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు.

ఆధార్, బయోమెట్రిక్, డిజిటల్ హాజరు వంటి సాంకేతిక నిబంధనలతో గ్రామీణ పేదలను ఉపాధికి దూరం చేసే ప్రయత్నాలను వ్యతిరేకించారు. గ్రామ సభలకు పనుల ఎంపికలో అధికారం ఇవ్వాలని, వేతనాలు సకాలంలో చెల్లించాలని, ఉపాధి హామీకి కేంద్రం పూర్తి నిధులు కేటాయించాలని మహేష్ డిమాండ్ చేశారు. పేదల హక్కుల పరిరక్షణకు గ్రామీణ శ్రామిక వర్గం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

## వనపర్తి పట్టణ బీజేపీ అధ్యక్షుడిగా బత్తిని మధుసూదన్



**వనపర్తి బ్యూరో సెప్టెంబర్13 (జనంసాక్షి):**
భారతీయ జనతా పార్టీ (బీజేపీ) వనపర్తి పట్టణ అధ్యక్షుడిగా బత్తిని మధుసూదన్ నియమితులయ్యారు. ఈ మేరకు వనపర్తి జిల్లా బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు డి. నారాయణ చేతుల మీదుగా మధుసూదన్ నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా నూతన పట్టణ అధ్యక్షుడు బత్తిని మధుసూదన్‌కు పార్టీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడాలని నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు సుబ్బిరెడ్డి వెంకట్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ భాషెట్టి శ్రీనివాసులు, జిల్లా మీడియా కన్వీనర్ గజరాజుల తిరుమలేష్, జిల్లా అధికార ప్రతినిధి నక్క మహేష్ యాదవ్, 26వ వార్డు కౌన్సిలర్ విజయ్, యువమోర్చా అధ్యక్షుడు అరవింద్, 13వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి గోపీనాథ్, మైనార్టీ మోర్చా అధ్యక్షుడు ఖలీల్, ఐటీ సెల్ కన్వీనర్ ఆంజనేయులు, రాసాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### విమోచన దినోత్సవాన్ని

## అధికారికంగా నిర్వహించాలి



**పెద్ద శంకరంపేట్, సెప్టెంబర్ 13 (జనంసాక్షి):** సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సంగారెడ్డి జిల్లా బీజేపీ ఓబీసీ అధ్యక్షుడు కోణం విఠల్ డిమాండ్ చేశారు. ఆదివారం పెద్ద శంకరంపేట్‌లోని బీజేపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ నాయకత్వంలోని ఆపరేషన్ పోలో, తెలంగాణ ప్రజల పోరాట ఫలితంగా హైదరాబాద్ రాష్ట్రం భారతదేశంలో విలీనమైందన్నారు. ఈ చారిత్రక ఘట్టాన్ని గుర్తుచేసుకుంటూ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు శ్రావణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఎం.కృష్ణ, బీజేవైఎం అధ్యక్షుడు బుగుడాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### జాతీయ స్థాయి

## సైక్లింగ్ పోటీలలో చిన్నారుల ప్రతిభ



**మక్తల్, సెప్టెంబర్ 13 (జనంసాక్షి):** హైదరాబాద్ బండ్లగూడ (నాగోల్) వేదికగా జరిగిన ప్రథమ క్యాడేట్ జాతీయస్థాయి సైక్లింగ్ రోడ్డు ఛాంపియన్షిప్‌లో నారాయణపేట జిల్లా విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 8 నుంచి 11 సంవత్సరాల వయసుగల బాలబాలికల కోసం నిర్వహించిన 2 కి.మీ. పోటీలలో దేశవ్యాప్తంగా 16 రాష్ట్రాల నుండి 356 మంది పాల్గొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బి. గోపాలం ఆధ్వర్యంలో జిల్లా నుంచి ఆరుగురు చిన్నారులు పాల్గొని జాతీయ స్థాయి సర్టిఫికెట్లు సాధించారు. మొట్టమొదటిసారిగా జాతీయ పోటీలలో పాల్గొని మన పిల్లలు ప్రతిభ చాటడం పట్ల నిర్వాహకులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ క్రీడాకారులను అభినందించారు.

# జాతీయ లోక్ అదాలత్‌లో 5,254 కేసుల పరిష్కారం

- **సైబర్ నేరాల బాధితులకు రూ.20.27 లక్షల నగదు రీఫండ్**
- **సకాలంలో ఫిర్యాదు చేస్తే మోసపోయిన నగదును తిరిగి పొందే అవకాశం**
- **జిల్లా ఎస్పీ డి.వి.శ్రీనివాసరావు**




**మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 13 (జనంసాక్షి):** జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా మెదక్ జిల్లాలో పోలీసు, న్యాయశాఖల సమన్వయంతో వివిధ రకాల కేసులను సత్వరమే పరిష్కరించినట్లు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. జిల్లాలో మొత్తం 5,254 కేసులకు పరిష్కారం లభించిందని వెల్లడించారు. వీటిలో 3,984 డీడీ కేసులు, 538 ఐపీసీ కేసులు, 732 ఈ–పెట్టీ కేసులు ఉన్నట్లు తెలిపారు.

**సైబర్ బాధితులకు ఊరట...**

సైబర్ నేరాల బాధితులకు ఊరట కల్పించేలా పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఎస్పీ తెలిపారు. జిల్లాలోని 14 సైబర్ నేరాల కేసుల్లో కోర్టు ఆదేశాల మేరకు మొత్తం రూ.20 లక్షల 27 వేల నగదును బాధితులకు తిరిగి అందజేసినట్లు వెల్లడించారు.

సైబర్ మోసానికి గురైన వారు ఆలస్యం చేయకుండా వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. సకాలంలో ఫిర్యాదు చేయడం ద్వారా మోసపోయిన నగదును నిలుపుదల చేసి, తిరిగి పొందే అవకాశం ఉంటుందని ఎస్పీ తెలిపారు.

**అధికారులకు అభినందనలు...**

కేసుల పరిష్కార ప్రక్రియలో న్యాయస్థాన విధుల్లో ఉన్న అధికారులు, దర్యాప్తు అధికారులు, పోలీసు సిబ్బంది, న్యాయస్థాన సిబ్బంది సమన్వయంతో పనిచేసి విశేష కృషి చేశారని ఎస్పీ అభినందించారు. బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా సంబంధిత కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, అవసరమైన న్యాయపరమైన చర్యలను సమర్థవంతంగా పూర్తి చేసిన అధికారులను ప్రశంసించారు.

**సత్వర న్యాయానికి సమర్థవంతమైన వేదిక...**

ప్రజలకు సత్వర న్యాయం అందించడంలో జాతీయ లోక్ అదాలత్ ఒక సమర్థవంతమైన వేదికగా నిలుస్తుందని ఎస్పీ పేర్కొన్నారు. రాజీకి అవకాశం ఉన్న కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకుని సత్వర న్యాయం పొందాలని ప్రజలకు సూచించారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి పోలీసు శాఖ తరఫున పూర్తి సహకారం అందిస్తామని ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు.

## మట్టి వినాయకునే పూజించండి



**రేగోడు, సెప్టెంబర్ 13 (జనంసాక్షి):** మట్టి వినాయకులనే పూజించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తోడ్పడాలని కాంగ్రెస్ యువ నాయకుడు చక్రపాణి, సీనియర్ నాయకులు రామగౌడ్, ఆదిత్య గౌడ్ సూచించారు. రేగోడులోని పాఠశాల ఆవరణలో హనుమాన్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో మట్టి గణపతుల తయారీ పోటీ నిర్వహించారు. సుమారు 40 మంది చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని తమ సృజనాత్మకతను చాటుకున్నారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వినాయక చవితిని భక్తిశ్రద్ధలతో, పర్యావరణహితంగా జరుపుకోవాలని సూచించారు. చిన్నారుల్లో ప్రతిభను వెలికితీసేలా కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. పోటీలో కార్తీక్ మొదటి, కుందన రెండో, సాయి అక్షర, సృజన సంయుక్తంగా మూడో బహుమతి సాధించారు. విజేతలకు అతిథులు బహుమతులు అందజేసి అభినందించారు. మర్పల్లి సర్పంచ్ నాగలక్ష్మి నర్సింలు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాధా కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కును పంపిణీ చేసిన మాజీ ఎమ్మెల్యే



**సిర్గాపూర్, సెప్టెంబర్ 13 (జనంసాక్షి):** సిర్గాపూర్ మండలం నల్లవాగు గ్రామానికి చెందిన పారమ్మ గారికి 12,000, రూపాయలు సిర్గాపూర్ మండలం వాసర్ గ్రామానికి చెందిన విట్టల్ రావు గారికి 25,500, రూపాయల ముఖ్యమంత్రి సహాయని ద్వారా మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేసిన నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి. వారితోపాటు మాజీ మున్సిపల్ కౌన్సిలర్ విట్టల్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోపాల్,మాజీ సర్పంచులు రాజు నాయక్, రవీందర్ నాయక్, సురేష్, మాజీ ఉపసర్పంచ్ భూషణం, ఈశ్వర్, సద్దాం, దస్తగిరి, దేవేందర్, శివాజీ పటేల్, రఫీమోద్దిన్, రమేష్, మచ్చేందర్, గోవర్ధన్ రెడ్డి, ప్రశాంత్ సాగర్, చింటూ నరేష్ తదితరులు ఉన్నారు.

## రహదారి పనులు త్వరగా పూర్తి చేయాలి

- **జనసేన నాయకులు దోనే అశోక్**



**బెజ్జంకి,సెప్టెంబర్ 13 (జనంసాక్షి):** మండలంలోని రహదారులు అధ్వానంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడం లేదని ఆదివారం జనసేన నాయకులు దోనే అశోక్ విమర్శించారు. శనిగరం ఎక్స్ రోడ్డు నుంచి గన్నేరువరం వరకు సుమారు రూ.22 కోట్లతో చేపట్టిన రెండు వరుసల రహదారి అభివృద్ధి పనులు ఏళ్లుగా కొనసాగుతున్నా పూర్తికాకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. రోడ్డుపై గుంతలు, దుమ్ము కారణంగా వాహనదారులు ఇబ్బందులు పడటంతో పాటు ప్రమాదాల ముప్పు పెరిగింది అనీ అన్నారు. ఈ మార్గం మానసదేవి దేవాలయానికి వెళ్లే ప్రధాన రహదారి కావడంతో ప్రతిరోజూ భక్తులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని రహదారి నిర్మాణ పనులను వేగవంతం చేసి, త్వరితగతిన పూర్తి చేయాలని దోనే అశోక్ డిమాండ్ చేశారు. గత ప్రభుత్వాల తప్పిదాలను సాకుగా చూపకుండా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి రహదారి అభివృద్ధిపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మల్యాల శేషు కుమార్, గంగాధర తిరుపతి, గొడుగు సంపత్, సంతోష్ తదితరులతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## తెలంగాణ అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత

- **బీజేపీ రాష్ట్ర నాయకులు అయ్యగారి ప్రభాకర్ రెడ్డి**
- **ఆపరేషన్ పోలో డే సందర్భంగా అమర సైనికులకు ఘన నివాళులు**



**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 13 (జనంసాక్షి):** ఆపరేషన్ పోలో డే సందర్భంగా సేవా సంకల్ప అభియాన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో హోం మంత్రి సర్దార్ వల్లభభాయ్ పటేల్ చిత్రపటానికి, తెలంగాణ విమోచన కోసం ప్రాణత్యాగం చేసిన అమర సైనికులకు ఘన నివాళులు అర్పించారు. జిల్లా సేవా సంకల్ప అభియాన్ కన్వీనర్ పెద్దిరాజు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర నాయకులు అయ్యగారి ప్రభాకర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా అయ్యగారి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. 1948 సెప్టెంబర్ 13న సర్దార్ వల్లభభాయ్ పటేల్ నాయకత్వంలో ప్రారంభమైన ఆపరేషన్ పోలో, నిరంకుశ నిజాం పాలన నుంచి తెలంగాణ విముక్తికి, హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో సంపూర్ణ విలీనానికి మార్గం సుగమం చేసిన చారిత్రాత్మక ఘట్టమని అన్నారు.1947 ఆగస్టు 15న యావత్ భారతదేశం స్వాతంత్ర్య సంబరాలు జరుపుకున్నప్పటికీ, తెలంగాణ ప్రజలు నిజాం, రజాకార్ల అణచివేత, హింస, దౌర్జన్యాలను మరో 13 నెలల పాటు భరించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. తెలంగాణ విమోచన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.నాటి హైదరాబాద్ సంస్థానంలో భాగమైన కర్ణాటక, మహారాష్ట్ర ప్రభుత్వాలు విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నాయని, అయితే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు ప్రత్యేక తెలంగాణలోనూ విమోచన దినోత్సవానికి తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని విమర్శించారు. ఎంఐఎం పార్టీ మెప్పు కోసం మైనార్టీ ఓట్ల రాజకీయాలు చేయడం వల్ల తెలంగాణ విమోచన చరిత్రకు తగిన గుర్తింపు లభించలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్. వెంకటేశ్వర్ రెడ్డి, జిల్లా సేవా సంకల్ప అభియాన్ కన్వీనర్ పెద్దిరాజు, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్ గౌడ్, వారణాసి కల్పన, కార్యదర్శులు, ఉపాధ్యక్షులు గొర్ల బాబురావు, జిల్లా కార్యదర్శి శ్రీమతి సరోజ, సీనియర్ నాయకులు సుమిత్రమ్మ, బాశెట్టి శ్రీనివాసులు, కొమ్ము సామేలు, బచ్చు రాము, గుంటి శివ, ఆగపోగు కుమార్, దాసరాజు ప్రవీణ్, ఎద్దుల దేవేందర్, యువమోర్చా అధ్యక్షులు అరవింద్, మహిళా మోర్చా అధ్యక్షులు కవిత, మైనార్టీ మోర్చా మాజీ అధ్యక్షులు ఎండి. ఖలీల్, కంటెస్టెడ్ పట్టణ కార్యదర్శి చినరాయుడు, కౌన్సిలర్లు గంధం బాల, పేరు ఉండెకోటి వెంకటేష్, తిరుపతయ్య యాదవ్, కొండోజు గోపీనాథ్, వసిరామ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### కాట్రియాలలో సందడిగా

## క్రికెట్ కేపీఎల్ సీజన్-4 ప్లేయర్స్ ఆక్షన్

ప్లేయర్స్ ఆక్షన్ సందర్భంగా తమ జట్లకు ప్రతిభావంతులైన ఆటగాళ్లను దక్కించుకునేందుకు ఓనర్లు ఆసక్తిగా పాల్గొనడంతో కార్యక్రమం ఉత్కంఠభరితంగా సాగింది. తమకు అవకాశం దక్కుతుందనే ఆశతో ఆటగాళ్లు సైతం ఆక్షన్ పై ఆసక్తి కనబరిచారు. సంక్రాంతి సందర్భంగా జరిగే కేపీఎల్ క్రికెట్ పోటీల కోసం గ్రామ యువతలో ఇప్పటికే సందడి నెలకొంది. పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు నిర్వాహకులు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో కేపీఎల్ నిర్వాహకులు ద్యాగల భాను ప్రసాద్, మైలారం శ్రీకాంత్, మంచోజి ప్రశాంత్, మద్ది వీరేశం, ద్యాగల మహేష్, ద్యాగల కమల్, రాగిశెట్టి ప్రశాంత్, మైలారం శ్రీధర్, టీం ఓనర్లు, గ్రామనాయకులు,క్రీడాకారులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# మట్టి గణపతులను ప్రతిష్టించాలి: ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి

**శివ్వంపేట, సెప్టెంబర్ 13(జనంసాక్షి):** వినాయక చవితి పండుగ రోజున మట్టి గణపతులను ప్రతిష్టించి, వాటిని పూజించి పర్యావరణ సమతుల్యతనను కాపాడాలని ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. శివ్వంపేట మండలం దొంతి బీఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు చిగుళ్లపల్లి శ్రీనివాస్ గుప్తా ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన గ్రామస్తులకు మట్టి విగ్రహాల పంపిణీ కార్యక్రమానికీ ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై భక్తులకు మట్టి వినాయకులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ మట్టి గణపతులను పూజించడం ద్వారా భక్తిభావంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా చేయూతనిచ్చిన వారమవుతామని, రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారయ్యే విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమై చెరువు చెరువులలో ఉండే జీవరాశులు నశింపబడతాయన్నారు. కాబట్టి ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను ప్రతిష్ఠించి పూజించాలని, భక్తితో గణపయ్యను కొలుస్తూనే ప్రకృతిని కాపాడే బాధ్యత ప్రతి వ్యక్తిపై ఉందన్నారు. అనంతరం ప్రజలకు ఉచితంగా మట్టి గణపతి విగ్రహాలను అందించి, పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతున్న గ్రామ కమిటీ అధ్యక్షుడు చిగుళ్లపల్లి శ్రీనివాస్ గుప్తాను ఎమ్మెల్యేతో పాటు పలువురు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రమణ గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, జెడ్పి కో ఆప్షన్ మాజీ సభ్యుడు మన్సూర్, ఉప సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షులు పవన్ గుప్తా, రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షులు నాగేశ్వర్ రావు, బీఆర్ఎస్ నాయ



కులు యాదాగౌడ్, మర్రి మహేందర్ రెడ్డి, సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, బుద్దుల భిక్షపతి, జగన్ రెడ్డి, వారాల శ్యామ్, వంజరి రాహుల్, శ్రీకాంత్ రెడ్డి, పిట్ల కృష్ణ, మంగలి రమేష్, సుకుమార్, జంగం స్వామి, కైట్, ముత్యాలు, గ్రామస్థులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ప్రశ్నిస్తే ఉలికిపాటు తగదు: రమణ గౌడ్



**శివ్వంపేట, సెప్టెంబర్ 13 (జనంసాక్షి):** కాంగ్రెస్ వెయ్యిరోజుల పాలన పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమణ గౌడ్ విమర్శించారు. దొంతి గ్రామంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నాయకుల దిష్టిబొమ్మలు దగ్ధం చేయడం సిగ్గుచేటన్నారు. వెయ్యి రోజుల పాలనలో సాధించిన విజయాలు, ప్రజలకు చేసిన మేలును కాంగ్రెస్ నాయకులు వివరించాలని డిమాండ్ చేశారు. దిష్టిబొమ్మల దగ్ధంతో ప్రజా సమస్యలను పక్కదారి పట్టించలేరన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే కాంగ్రెస్ నాయకులు ఉలికిపడటం తగదని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో తాటి పవన్ గుప్తా, నాగేశ్వర్ రావు, యాదగౌడ్, మహేందర్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి

• రెవెన్యూ అదనపు కలెక్టర్ హరిప్రియ


**జడ్చర్ల, సెప్టెంబర్ 13 (జనంసాక్షి):** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ అధికారులను ఆదేశించారు. ప్రత్యేక ప్రచార దినాల్లో భాగంగా ఆదివారం



బాలానగర్ మండలంలోని పెద్దాయిపల్లి (పోలింగ్ కేంద్రాలు 82, 83), కేతిరెడ్డిపల్లి (పోలింగ్ కేంద్రాలు 104, 105) గ్రామాల్లోని పలు పోలింగ్ కేంద్రాలను ఎన్నికల నమోదు అధికారి, అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి రికార్డులు, ఓటర్ నమోదు దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రత్యేకంగా నోటీసు విచారణలు, సమాచార లోపాలు, అనుసంధానం కాని దరఖాస్తులకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను ప్రత్యక్షంగా పరిశీలించి, అర్హత కలిగిన ప్రతి ఓటరుకు న్యాయం జరిగేలా తదుపరి చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. కొత్త ఓటర్ల నమోదు, వివరాల మార్పులు-చేర్పులు, తొలగింపుల్లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిబంధనల ప్రకారం బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సంబంధిత మండల అభివృద్ధి అధికారి, సీనియర్ అసిస్టెంట్, రెవెన్యూ తనిఖీదారు, పంచాయతీ కార్యదర్శులు, పోలింగ్ కేంద్ర స్థాయి అధికారులు, పోలింగ్ కేంద్ర స్థాయి ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## సబ్బుపై వినాయక ప్రతిమను చిత్రించిన ఉపాధ్యాయుడు





**తూప్రాన్, సెప్టెంబర్ 13(జనంసాక్షి):** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మనోహరాబాద్‌లో విధులను నిర్వహిస్తున్న చిత్రలేఖన ఉపాధ్యాయుడు మేడోజి బ్రహ్మాచారి వినాయక చవితి పండుగ సందర్భంగా వినూత్నంగా సబ్బు పై వినాయక ప్రతిమను తయారు చేయడం జరిగింది. పండుగ సందర్భంగా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ సుఖ శాంతులు ,అష్టాశ్వర్యాలు పొందాలని కోరాడు.

## అంగరంగ వైభవంగా ఉభయ మద్దిలేశ్వరి మాత జాతర

**నారాయణపేట,సెప్టెంబర్ 13 (జనంసాక్షి):** నారాయణపేట జిల్లా కేంద్రం లోని మద్దిలేశ్వరి కాలనీలో ఉభయ మద్దిలేశ్వరి మాత జాతర ఉత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి. భక్త మార్కండేయ



స్వామి ఆలయంలో అమ్మవారి ఉత్సవమూర్తికి పంచామృత, పుష్పాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భజనల మధ్య పల్లకి సేవగా అమ్మవారి ఆలయానికి తీసుకెళ్లారు. విశేష పూజలు, మహా మంగళహారతి అనంతరం అన్నదాన ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు డాక్టర్ క్యాతన్ రఘునాథ్, కార్యదర్శి తిలక్, కోశాధికారి నరసింహులు, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

## అంబాజీపేటలో స్పెషల్ ఓటర్ క్యాంపు పరిశీలన

**చిన్న శంకరంపేట, సెప్టెంబర్ 13 (జనంసాక్షి):**
రెండు రోజులపాటు మండలంలో స్పెషల్ ఓటర్ క్యాంప్ నిర్వహిస్తుండగా తహసిల్దార్ మాలతి శనివారం అంబాజీపేట గ్రామంలో స్పెషల్ ఓటర్ క్యాంపును పరిశీలించారు. ఎంతమంది ఓటర్లు ఓటు హక్కు కోసం నమోదు చేసుకున్నారని అడిగి తెలుసుకున్నారు. అనంతరం తాసిల్దార్ మాలతి మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్క యువతి యువకులు పొందేందుకు




గ్రామాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక హోదా నమోదు కేంద్రాలను ఉపయోగించుకోవాలని కోరారు.

## పేదలకు వైద్య భరోసా... ఆపన్నులకు అండగా ప్రజా ప్రభుత్వం

• మంత్రి వాకిటి శ్రీహరి

**మక్తల్, సెప్టెంబర్ 13 (జనంసాక్షి):**
మక్తల్ పట్టణంలోని స్థానిక క్యాంపు కార్యాలయంలో మంత్రి వాకిటి శ్రీహరి శనివారం 229 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతూ ఖరీదైన వైద్యం చేయించుకోలేక ఇబ్బందులు పడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ఈ చెక్కులను అందజేశారు.
ఈ కార్యక్రమంలో మొత్తం 229 మంది లబ్ధిదారులకు రూ. 88,97,890 విలువైన చెక్కులను మంత్రి శ్రీహరి స్వయంగా అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న ప్రతి పేద కుటుంబానికి ప్రజా ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. అత్యవసర వైద్య చికిత్సల కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నవారికి సీఎంఆర్ఎఫ్ ఒక వరంగా మారిందని, అర్హులైన ప్రతిఒక్కరూ ఈ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.



తమ అనారోగ్య సమస్యలకు ప్రభుత్వ నుంచి ఆర్థిక సహాయం అందడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చెక్కులు అందుకున్న లబ్ధిదారులు మంత్రి వాకిటి శ్రీహరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మట్టి విగ్రహాలను పూజిద్దాం





**తూప్రాన్, సెప్టెంబర్ 13 (జనంసాక్షి):** ప్రతిఒక్కరూ మట్టి వినాయకులనే పూజించాలని పర్యావరణ పరిరక్షణ కాపాడాలని నాచారం గుట్ట ట్రస్ట్‌బోర్డ్ చైర్మన్ పల్లెర్ల రవీందర్ గుప్త తెలిపారు. తూప్రాన్ సూర్యా మెడికల్ యజమాని బొడ్డు శ్రీహరి రమ్య ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేసిన సందర్భంగా మాట్లాడారు పర్యావరణాన్ని రక్షించడంలో ప్రతిఒక్కరు తోడ్పాటు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ జానకిరామ్ పూర్ణరాజు తదితరులు పాల్గొన్నారు. అక్షర స్కూల్లో విద్యార్థులకు విగ్రహాలను యాజమాన్యం పంపిణీ చేశారు.

## క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలి

**ఉర్కొండ, సెప్టెంబర్ 13 (జనంసాక్షి):** గ్రామీణ ప్రాంత క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని నాగర్‌కర్నూల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ముచ్చర్ల జనార్దన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఉర్కొండ మండల కేంద్రంలో జిల్లా కబడ్డీ జట్ల ఎంపికలు నిర్వహించారు. జూనియర్ బాలురు, బాలికలు, సబ్‌జూనియర్ బాలికల విభాగాల్లో జరిగిన ఎంపికలకు జిల్లాలోని వివిధ మండలాల నుంచి 300 మందికి పైగా క్రీడాకారులు హాజరయ్యారు.
జనార్దన్‌రెడ్డి, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి యాదయ్యగౌడ్, గ్రామ సర్పంచ్ మంజుల శ్రీనివాసులు ఎంపికలను ప్రారంభించారు. ఎంపికైన జూనియర్ బాలురు, సబ్‌జూనియర్ బాలికలు ఈ నెల 26 నుంచి 29 వరకు వేములవాడలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ ఛాంపియన్‌షిప్‌లో నాగర్‌కర్నూల్ జిల్లా తరఫున పాల్గొంటారని యాదయ్యగౌడ్ తెలిపారు. జూనియర్ బాలికలు వచ్చే నెల 10 నుంచి 13 వరకు ఖమ్మం జిల్లా అశ్వారావుపేటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు మ్యకల శ్రీనివాసులు, రమేష్, డాక్యా మోహన్, ప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయులు జ్యోతి, భారతి, గణేశ్వరి, సుజాత తదితరులు పాల్గొన్నారు.



## రాజగోపాల్ పేటలో ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతం



నంగునూర్, సెప్టెంబర్ 13 (జనంసాక్షి): సిద్దిపేట జిల్లా నంగునూర్ మండలం రాజగోపాల్‌పేట గ్రామంలో 'హెల్పింగ్ హ్యాండ్స్' గ్రూప్, సోమాజిగూడ 'యశోదా హాస్పిటల్స్' సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతమైంది.గ్రామంలో నిర్వహించిన ఈ శిబిరంలో దాదాపు 450 మందికి పైగా గ్రామస్తులకు వైద్య నిపుణులు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. గ్రామ యువత ముందుకొచ్చి ప్రజల ఆరోగ్యం కోసం ఇలాంటి మంచి కార్యక్రమం నిర్వహించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చేర్యాల వాణి రాధాకృష్ణ, టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి కాటం శివ, నాయకులు రంగు రాజు గౌడ్, జజాల చందు,ఎండీ అజాస్, జిపిఓ , స్థానిక ఎస్సై, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. శిబిరం జయప్రదానికి కృషి చేసిన హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు సుధగోని శ్రావణ్ గౌడ్, కస్తూర్ పల్లి రమేశ్, నాంపల్లి శ్రీకాంత్, గోవిందారం సాయి, తత్తరి రాజు, గోవిందారం మనోహర్, శ్యామ్, మాల హరీష్, నరేష్, పెంటం మహేష్, చందు, రాజు తదితరులను గ్రామస్తులు అభినందించారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



మక్తల్, సెప్టెంబర్ 13 (జనంసాక్షి): పర్యావరణ పరిరక్షణలో భాగంగా మక్తల్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వాకిటి మానస హన్మంతు నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో 450 మట్టి విగ్రహాలను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రసాయన విగ్రహాలతో నీరు, నేల కాలుష్యానికి గురవుతున్నాయని తెలిపారు. రాబోయే తరాల కోసం పర్యావరణహిత మట్టి వినాయకులనే వినియోగించాలని పిలుపునిచ్చారు. వినాయక నవరాత్రులను భక్తిశ్రద్ధలతో పాటు ప్రకృతి పరిరక్షణ బాధ్యతతో జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రహీమ్ పటేల్, శ్రీవిద్య నీలాగౌడ్, సరిత గోవింద్‌రావు, చెన్నమ్మ నీలప్ప, జుట్ల అనిత, సత్యమ్మ, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

## ఖో-ఖో క్రీడాభివృద్ధికి కృషి చేస్తా


- రాష్ట్ర అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా మట్ట కృష్ణ గౌడ్



ఉర్కొండ, సెప్టెంబర్ 13 (జనంసాక్షి): తెలంగాణ ఖో-ఖో అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా మట్ట కృష్ణ గౌడ్ ఎన్నికయ్యారు. నాగర్ కర్నూల్ జిల్లా ఉర్కొండ మండలంలోని ఊరుకొండ పేట గ్రామానికి చెందిన మట్ట కృష్ణ గౌడ్ కు ఈ పదవి దక్కడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కల్వకుర్తి మండలం మార్చల గ్రామానికి చెందిన సామ శ్రీనివాసులు ని ఈసీ మెంబర్ గా సోమశిల లో జరిగిన రాష్ట్ర జనరల్ బాడీ మీటింగ్ లో రాష్ట్ర అధ్యక్షులు ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి మరియు ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి సమక్షంలో ప్రకటించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన పై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన అసోసియేషన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో ఖో-ఖో క్రీడాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఎన్నిక పట్ల పలువురు ప్రముఖులు, క్రీడాకారులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖో ఖో అసోసియేషన్ రాష్ట్ర రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఉమ్మడి మహబూబ్నగర్ చెందిన కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో వినాయక నవరాత్రి ఉత్సవాలు నిర్వహించుకోవాలి

- నూతన వినాయక షెడ్డులను ప్రారంభించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



అమీన్పూర్, సెప్టెంబర్ 13 (జనంసాక్షి): పటాన్చెరు నియోజకవర్గ ప్రజలందరూ వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సవాల మధ్య ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఆదివారం బీరంగూడ డివిజన్ పరిధిలోని సాయికృపా కాలనీ, సాయి భగవాన్ కాలనీలలో నూతనంగా నిర్మించిన వినాయక షెడ్డులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన వినాయక చవితి సందర్భంగా కాలనీల్లో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలంతా ఐకమత్యంతో పండుగను జరుపుకోవాలని సూచించారు. కాలనీల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు, అభివృద్ధి కార్యక్రమాలకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందనారు. ప్రజలందరికీ వినాయక చవితి పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, మాజీ ప్రజా ప్రతినిధులు మల్లేష్, బాలరాజు, కృష్ణ, జగదీష్ తదితరులతో పాటు ఆయా కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, స్థానిక నాయకులు, భక్తులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## సుప్రీంకోర్టు నోటీసులను స్వాగతిస్తున్నాం

- తెలంగాణాలో ప్రైవేటు టీచర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి
- మెదక్ లో 2000 మంది ప్రైవేట్ టీచర్ల కోసం సంక్షేమ బోర్డు కావాలి
- తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం (టిపిటిఎఫ్)
- మెదక్ జిల్లా అధ్యక్షులు బాలసాయి హరిప్రసాద్



తూప్రాన్, సెప్టెంబర్ 13(జనంసాక్షి): ప్రైవేటు స్కూల్ టీచర్ల సంక్షేమానికి జాతీయ విధానం కావాలని దాఖలైన పిటిషన్ ను సుప్రీంకోర్టు విచారణకు స్వీకరించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేయడాన్ని తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం మెదక్ జిల్లా శాఖ హృదయపూర్వకంగా స్వాగతిస్తోందని, ప్రైవేట్ టీచర్ల తరపున ధన్యవాదాలు తెలుపుతున్నామని జిల్లా అధ్యక్షులు బాలసాయి హరిప్రసాద్ తెలిపారు. సెప్టెంబర్ 10న న్యూఢిల్లీలో జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం కేరళకు చెందిన లిజిమోల్ జార్జ్ వేసిన పిల్ ను స్వీకరించి కేంద్ర ప్రభుత్వం, అన్ని రాష్ట్రాలు, నోటీసులు జారీ చేసి విచారణను 4 వారాలకు వాయిదా వేయడం చారిత్రాత్మకమని అన్నారు. కేంద్ర విద్యాశాఖ 2023-24 లెక్కల ప్రకారం దేశంలో 14.71 లక్షల స్కూళ్లు, 98 లక్షల మంది ఉపాధ్యాయులు, 24.8 కోట్ల మంది విద్యార్థులు ఉంటే, అందులో ఒక్క గుర్తింపు పొందిన ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూళ్లలోనే 37,30,047 మంది టీచర్లు పనిచేస్తున్నారని పిటిషనర్ పేర్కొన్నారు. అయినా వారికి కనీస వేతనం, ఈఎస్ఐ, పిఎఫ్, గ్రాట్యుటీ, పెన్షన్ లాంటి భద్రత లేకపోవడం బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

**మెదక్ జిల్లా పరిస్థితి - ముఖ్యమంత్రికి విజ్ఞప్తి...**

2024-25 UDISE లెక్కల ప్రకారం ప్రస్తుత మెదక్ జిల్లాలోనే సుమారు 109 ప్రైవేట్ స్కూళ్లలో 2,000 మందికి పైగా ప్రైవేట్ టీచర్లు పనిచేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 3 లక్షల మంది ప్రైవేట్ టీచర్లు ఉన్నారు. వీరందరి సంక్షేమం కోసం సుప్రీంకోర్టు స్ఫూర్తితో తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీ ఎ.రేవంత్ రెడ్డి గారు వెంటనే ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రైవేట్ టీచర్లను చట్టబద్ధ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రతా చట్టం తీసుకురావాలని, సుప్రీంకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ టీచర్లకు అనుకూలంగా నివేదిక ఇవ్వాలని తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం (టిపిటిఎఫ్ ) మెదక్ జిల్లా తరపున డిమాండ్ చేస్తున్నామని బాలసాయి హరిప్రసాద్ తెలిపారు.

## సీసీ రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

**పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలి: మున్సిపల్ వైస్ చైర్మన్ నరేష్ గౌడ్**



మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 13 (జనంసాక్షి): మెదక్ పట్టణంలోని నవాపేట్ వీధిలో కొనసాగుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు నిర్మాణ పనుల పురోగతిని, నాణ్యతా ప్రమాణాలను ఆయన స్వయంగా పరిశీలించి, సంబంధిత మున్సిపల్ అధికారులను పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నరేష్ గౌడ్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన, నాణ్యమైన రహదారి సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. సీసీ రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణలను తప్పనిసరిగా పాటించాలని అధికారులకు సూచించారు. నిర్మాణ పనుల కారణంగా స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. మెదక్ పట్టణంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల అభివృద్ధికి మున్సిపాలిటీ అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఆయన పేర్కొన్నారు. పట్టణంలోని మిగిలిన ప్రాంతాల్లో కూడా అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి దశలవారీగా చేపడతామని నరేష్ గౌడ్ తెలిపారు. ప్రజలకు మెరుగైన రహదారులు, మౌలిక వసతులు అందించేందుకు నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు.

## సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి: మంజె మల్లేశం

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మంజె మల్లేశం
- కాశగుడిసెల గ్రామ కమిటీ ఎన్నిక



చేర్యాల, సెప్టెంబర్ 13(జనంసాక్షి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని చేర్యాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంజె మల్లేశం పిలుపునిచ్చారు. మండలంలోని కాశగుడిసెల గ్రామంలో మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఆదేశాల మేరకు మండల అధ్యక్షులు మంజ మల్లేశం ఆధ్వర్యంలో ఆదివారం గ్రామ కాంగ్రెస్ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే పేదల సొంతింటి కల నెరవేర్చడం కోసం ఇందిరమ్మ ఇండ్లు, ప్రతి కుటుంబానికి నిరంతరంగా రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, మహిళల సంక్షేమం కోసం ఉచిత బస్సు ప్రయాణం, రైతు సంక్షేమం కోసం రైతు రుణమాఫీ రైతు భరోసా రైతు భీమా పథకాలను అమలు చేస్తుందని అన్నారు. ఇతర అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా పలన ప్రభుత్వం గా నడుస్తుందని అన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి క్షేత్రస్థాయిలో తీసుకెళ్లాలని కోరారు. గ్రామ శాఖ అధ్యక్షులుగా షేక్ షరీఫ్, ఉపాధ్యక్షులుగా షేక్ ఎక్రమద్దీన్, ప్రధాన కార్యదర్శులుగా షేక్ హజరత్, కమల్, కోశాధికారిగా షరీఫ్, షేక్ బాబా, యూత్ అధ్యక్షులుగా షేక్ మదర్, ఉపాధ్యక్షులుగా అజ్జు, సోషల్, మీడియా అధ్యక్షులు ఇబ్రాహీం, అన్వర్, అలీలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అందె నానిబాబు, మాజీ సర్పంచ్ షేక్ సమీర్,మండల ప్రధాన కార్యదర్శి శవల్ల రాజయ్య, మండల కార్యదర్శులు తాటికొండ సదానందం, కోయినేని నరసయ్య, ఎండి. కలీం పాషా, కరెడ్ల చింటు పాల్గొన్నారు.

# తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం నేటి తరానికి ఆదర్శం

• సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వి.ప్రకాష్‌రావు



**సంగారెడ్డి, సెప్టెంబర్ 13 (జనంసాక్షి):** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం నిస్వార్థంగా సాగిన మహత్తర పోరాటమని, ఆ పోరాట చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చి భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వి. ప్రకాష్‌రావు అన్నారు. ఆదివారం సదాశివపేట పట్టణంలోని సిపిఐ పార్టీ కార్యాలయం ముందు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు... నైజాం నవాబు నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా భూమి, భుక్తి, వెట్టిచాకిరీ విముక్తి కోసం 1946 నుంచి 1951 వరకు కమ్యూనిస్టుల నాయకత్వంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం చారిత్రాత్మకంగా సాగిందని తెలిపారు. నైజాం పాలనలో ప్రజలపై అధిక పన్నులు, దోపిడీ, వేధింపులు కొనసాగాయని, వెట్టిచాకిరీ పేరుతో ప్రజలను దోచుకున్నారని పేర్కొన్నారు.

ఆంధ్ర మహాసభ ఆధ్వర్యంలో గ్రామాల్లో సంఘాలను ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యవంతం చేశారని, నైజాం అరాచకాలకు వ్యతిరేకంగా ప్రజలు ఆయుధాలు చేపట్టి పోరాడారని తెలిపారు. ఈ పోరాటం ద్వారా సుమారు 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన ఘనత కమ్యూనిస్టు పార్టీదేనని అన్నారు. సుమారు 4 వేల మంది కమ్యూనిస్టులు అమరులయ్యారని, 3 వేల గ్రామాల్లో ప్రజా స్వయం పాలన ఏర్పడిందని తెలిపారు.

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని హిందూ-ముస్లిం పోరాటంగా చిత్రీకరించడం చరిత్రను వక్రీకరించడమేనని ప్రకాష్‌రావు అన్నారు. చరిత్రను వక్రీకరించి రాజకీయ ప్రయోజనాలు పొందేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. తెలంగాణ పోరాటం దేశవ్యాప్తంగా జరిగిన ప్రజా ఉద్యమాలకు మార్గదర్శకంగా నిలిచిందన్నారు.

ఈ సందర్భంగా అమరవీరుల స్థూపాలు, పార్టీ దిమ్మెల వద్ద ఎర్రజెండాలను ఆవిష్కరించారు.

కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శి సయ్యద్ జలాల్ రెహమాన్, తాజోద్దీన్, షఫీ, విష్ణు శంకరప్ప, పాండు, సాదిక్ అలీ, బుజ్జమ్మ, గంగమ్మ, సత్యమ్మ, పూలమ్మ, లడ్డు లక్ష్మి, సరస్వతి, సంగీత తదితరులు పాల్గొన్నారు.

# అమరుల త్యాగం అజరామరం



**పాపన్నపేట, ఏప్రిల్ 13 (జనంసాక్షి):**
సమాజ శ్రేయస్సులో బాధ్యతాయుతమైన విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలు అజరామరమని ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. 1999 సెప్టెంబర్ 13 న అర్ధరాత్రి పాపన్నపేట ఠాణాపై జరిగిన నక్సల్స్ దాడిలో అమరులైన పోలీసులను స్మరించుకున్నారు. ఆదివారం ఠాణాలో అమరుల స్థూపానికి పుష్పాంజలి సమర్పించి నివాళులర్పించారు.

మెరుపు దాడిలో అమరులైన హెడ్ కానిస్టేబుల్ రఘునందన్, కానిస్టేబుళ్లు అబిద్ హుస్సేన్, ప్రసాద్, నర్సింలు, రాంచందర్‌లు వీర మరణం పొందారు. ఆదివారం వారి కుటుంబీకులకు సన్మానించారు. నాడు జరిగిన విషాద ఘటనలో ఐదుగురు పోలీసులు అమరులు కావడం బాధాకరమని ఎస్ఐ అన్నారు. ఏఎస్ఐ తుక్కయ్య, కానిస్టేబుళ్లు అనిల్,నాగలక్ష్మి తదితరులు ఉన్నారు.

# చేర్యాల 5వ వార్డులో పాముల బెడద

• పట్టించుకోని చేర్యాల మున్సిపాలిటీ
• కమిషనర్ తీరుపై బీఆర్ఎస్ కార్యకర్త కాటం వెంకటేష్ ఆగ్రహం



**చేర్యాల, సెప్టెంబర్ 13(జనంసాక్షి):** చేర్యాల పట్టణంలోని 5వ వార్డులో పాముల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా మున్సిపల్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని చేర్యాల పట్టణ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త కాటం వెంకటేష్ ఆరోపించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత కొన్ని నెలలుగా సామాజిక మాధ్యమాల ద్వారా ఈ సమస్యపై పోరాటం చేస్తున్నా కమిషనర్ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే ఫిర్యాదు ఒక ధనవంతుడు చేస్తే ఇలానే వ్యవహరిస్తారా..? అని ప్రశ్నించారు. ఇప్పుడు పాములు పట్టే వారు వచ్చే వరకు వెయిట్ చేయాలా అని నిలదీశారు. వెంటనే కమిషనర్ స్పందించి 5వ వార్డుకు వచ్చి సమస్యను పరిష్కరించి ప్రజలకు న్యాయంచేయకపోతే తామే న్యాయ పోరాటానికి దిగుతామని హెచ్చరించారు.

# మాజీ జడ్పీటీసి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ డీసీఎంఎస్ చైర్మన్



**న్యాల్‌కల్, సెప్టెంబర్ 13(జనంసాక్షి):** మండల కేంద్రమైన న్యాల్‌కల్‌కు చెందిన మాజీ జెడ్పీటిసి స్వప్న, బీఆర్ఎస్ నాయకుడు భాస్కర్, ప్రభాకర్ కుటుంబ సభ్యులను మాజీ డిసిఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్ పరామర్శించారు. ఇటీవల మాజీ జెడ్పీటిసి స్వప్న (మామ), టిఆర్ఎస్ నాయకుడు భాస్కర్ (తండ్రి) సమ్మయ్య (82) అనారోగ్యంతో మృతి చెందారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం స్థానిక పార్టీ మద్దతుతో విజయం సాధించిన సర్పంచులు, పార్టీ శ్రేణులతో కలిసి కుటుంబ సభ్యులను ఓదార్చారు. బీఆర్ఎస్ నాయకుడు భాస్కర్ (తండ్రి) సమ్మయ్య (82) అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. విషయాన్ని తెలుసుకున్న మాజీ చైర్మన్, పార్టీ శ్రేణులతో కలిసి న్యాల్‌కల్ లోని కుటుంబానికి వెళ్లి పరామర్శించారు. పరామర్శించిన వారిలో పార్టీ శ్రేణులు ప్రవీణ్ కుమార్, అశోక్ పాటేల్, వెంకటేశం, సత్యనారాయణ, ఇసాం పాటిల్, నరసింహారెడ్డి, తదితరులు ఉన్నారు.

# రామాయంపేటలో 2 వేల ఎకో ఫ్రెండ్లీ వినాయకుల పంపిణీ



**రామాయంపేట, సెప్టెంబర్ 13 (జనంసాక్షి):**
వినాయక చవితి సందర్భంగా రామాయంపేట మున్సిపల్ ఆధ్వర్యంలో సుమారు 2 వేల ఎకో ఫ్రెండ్లీ మట్టి వినాయక విగ్రహాలను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ వినాయక చవితిని జరుపుకోవాలని కోరారు. మట్టి విగ్రహాలతో చెరువులు, నీటి వనరుల కాలుష్యాన్ని నివారించవచ్చున్నారు. కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. వైస్ చైర్‌పర్సన్ పోచమ్మల నవనీత గణేష్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి కబడ్డీకి హరిత ఎంపిక



**కల్హేర్, సెప్టెంబర్ 13(జనంసాక్షి):** కల్హేర్ మండలంలో కృష్ణాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని సీహెచ్. హరిత సబ్‌జూనియర్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికై పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకొచ్చింది. ఇటీవల పటాన్‌చెరులో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచిన హరిత, తన ఆటతీరుతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది.

ఈ నెల 26, 27 తేదీల్లో వేములవాడలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ కబడ్డీ పోటీల్లో హరిత పాల్గొననుంది. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థిని కబడ్డీ క్రీడలో రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం పట్ల గ్రామస్తులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. హరితకు కబడ్డీలో శిక్షణ అందిస్తూ ప్రోత్సహించిన పీఈటీ రాములును గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, కృష్ణాపూర్ గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

# తిమ్మప్ప దర్శనానికి వచ్చి కారు బోల్తా.. ముగ్గురికి తీవ్ర గాయాలు



**మల్దకల్, సెప్టెంబర్ 13 (జనంసాక్షి):**
తిమ్మప్ప స్వామి దర్శనానికి హైదరాబాద్ నుంచి మల్దకల్‌కు వచ్చిన ముగ్గురు ప్రయాణిస్తున్న కారు ఆదివారం అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ నరసింహులు, ఆంజనేయులు సహా ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి.


స్వామి దర్శనం అనంతరం హైదరాబాద్‌కు తిరిగి వెళ్తుండగా కారు రోడ్డు పక్కకు వెళ్లి బోల్తాపడింది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే క్షతగాత్రులను కారులో నుంచి బయటకు తీసి గద్వాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. గాయపడిన ముగ్గురూ హైదరాబాద్‌కు చెందినవారిగా గుర్తించారు. కారు అదుపుతప్పడానికి గల కారణాలు తెలియాల్సి ఉండగా, పోలీసులు ఘటనపై వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

# రైతు సమస్యలు పరిష్కరించాలి



**గోపాల్‌పేట, సెప్టెంబర్ 13 (జనంసాక్షి):**
రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించి, సమస్యలను తక్షణమే పరిష్కరించాలని భారతీయ కిసాన్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వి.సుబ్బయ్య డిమాండ్ చేశారు. గోపాల్‌పేటలో నిర్వహించిన రైతు సదస్సులో ఆయన మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.40 వేల పరిహారం ఇవ్వాలని, సాగు, తాగునీటి సమస్యలు పరిష్కరించాలని కోరారు. 24 గంటల ఉచిత విద్యుత్, చివరి ఆయకట్టు వరకు సాగునీరు, ఎంఎన్‌ఆర్‌ఈజీఎస్‌ను వ్యవసాయానికి అనుసంధానం చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ హామీ మేరకు రుణమాఫీని వారంలోపు అమలు చేయాలని కోరారు. అనంతరం మండల అధ్యక్షుడిగా ధన్వాడ నాగరాజు, కార్యదర్శిగా బాలస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

# విద్యుత్ సమస్యపై గద్వాలకు తరలిరండి



**మల్దకల్, సెప్టెంబర్ 13 (జనంసాక్షి):** ఈనెల 15వ తేదీన మంగళవారం రోజు విద్యుత్ సమస్యలపై రైతాంగం పెద్ద ఎత్తున గద్వాలకు తరలి రావాలని మల్దకల్ మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూకాంగ్రెస్ పార్టీ 24 గంటల ఉచిత కరెంటు ఇస్తామని చెప్పి హామీ నెరవేర్చక పోవడంతో జిల్లాలో ఉన్న రైతాంగం అనేక రకాలుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని టిఆర్ఎస్ పార్టీ నాయకులు తెలిపారు. ఈనెల 15వ తేదీ న విద్యుత్ సమస్యలపై జిల్లా ఉన్నతాధికారులకు వినతి పత్రం అందజేయడానికి జిల్లాలో ఉన్న రైతులు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ నాయకులు లవన్న, విష్ణు, ప్రేమ్ రాజ్, నజు ముల్లా, మీసాల కిష్టన్న, గ్రామ సర్పంచ్ కృష్ణ, గోపాల్, లక్ష్మన్న, బలిజ రాజు, పరుశ, తిరుపతి,లక్ష్మన్న, రవి తదితరులు పాల్గొన్నారు.

# వనపర్తిలో ఎమ్మెల్యే మేఘారెడ్డి విస్తృత పర్యటన





**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 13 (జనంసాక్షి):** వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆదివారం నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. విశ్వశాంతి మహాయాగంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు పలు శుభకార్యాలకు హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. పార్టీ నాయకులను కలుసుకుని, ఓ కుటుంబాన్ని పరామర్శించారు.



**విశ్వశాంతి మహాయాగంలో పూజలు...**



శ్రీశ్రీశ్రీ కృష్ణజ్యోతి స్వరూపానంద స్వామీజీ సంకల్పంతో వనపర్తిలో నిర్వహిస్తున్న 15 రోజుల విశ్వశాంతి మహాయాగంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసి స్వామీజీ ఆశీస్సులు పొందారు. ప్రజల సుఖసంతోషాలు, సుభిక్షం, ఆయురారోగ్యాల కోసం మహాయాగం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆధునిక జీవన విధానంలో కనుమరుగవుతున్న సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలను ఇటువంటి కార్యక్రమాలు భావితరాలకు పరిచయం చేస్తాయని పేర్కొన్నారు.

**శుభకార్యాలకు హాజరు...**

వనపర్తి ఎంవైఎస్ ఫంక్షన్ హాల్‌లో బెస్త నర్సింహులు, సునీతల మనుమడు అగస్త్యరామ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. కొత్తకోట రోడ్డులో నూతన ఎలక్ట్రికల్ స్కూటర్ షోరూమ్‌ను సందర్శించి నిర్వాహకులు ఇంతియాజ్, మేనేజర్ భాస్కరాచారిని అభినందించారు. అనంతరం కొత్తకోటలో పెద్దమందడి మండలం మద్దిగట్ల మాజీ ఎంపీటీసీ చాపల సత్యారెడ్డి మనవడి తొట్లే కార్యక్రమానికి, పామిరెడ్డిపల్లికి చెందిన మహేశ్వర్‌రెడ్డి, కీర్తిరెడ్డి దంపతుల కుమార్తె మొదటి పుట్టినరోజు వేడుకలకు హాజరై చిన్నారులను ఆశీర్వదించారు.

**ఎమ్మెల్యేకు ఆహ్వానం...**

వనపర్తి పట్టణ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు చీర్ల చందర్ నందిహిల్స్‌లో ఎమ్మెల్యేను కలిసి, వనపర్తి పాలిటెక్నిక్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుడి పూజా కార్యక్రమానికి హాజరుకావాలని ఆహ్వాన పత్రిక అందించారు. కార్యక్రమానికి తప్పకుండా హాజరవుతానని ఎమ్మెల్యే తెలిపారు. గణేష్ ఉత్సవాల్లో ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు, అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు.

**కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే...**

తన వ్యక్తిగత భద్రతా అధికారి జగదీశ్వర్‌రెడ్డి తల్లి మృతి చెందడంతో పామిరెడ్డిపల్లిలోని ఆయన నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

కార్యక్రమాల్లో మున్సిపల్, కాంగ్రెస్ నాయకులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## కుల రాజకీయాలు కట్టిపెట్టు.. ప్రజా హామీలు నెరవేర్చు!



**కొల్హాపూర్, సెప్టెంబర్ 13 (జనంసాక్షి):** ప్రతిపక్ష నేతలను చట్టసభల్లోకి వెళ్లకుండా అడ్డుకోవడం సరికాదని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు పుర్ర ప్రభాకర్ మాదిగ విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రశ్నిస్తారనే భయంతోనే అడ్డుకుంటున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి కుల రాజకీయాలు పక్కనపెట్టి ప్రజా సమస్యలు, అభివృద్ధిపై దృష్టి పెట్టాలని కోరారు. మాజీ సర్పంచ్ నీరుడి లక్ష్మయ్య మాట్లాడుతూ బస్సు ఉచిత ప్రయాణం మినహా ఎన్ని హామీలు అమలు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో దళితబంధు, భూ పంపిణీ, ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో రహదారులు, తండాలకు పంచాయతీ హోదా కల్పించారని పేర్కొన్నారు.

### ముస్తాబైన మండపాలు...

## నేడు కొలువుదీరనున్న గణనాథులు...







**నారాయణపేట సెప్టెంబర్13 (జనంసాక్షి):** నారాయణపేట జిల్లా వ్యాప్తంగా నేడు వినాయకచవితి సందర్భంగా కొలువుదీరనున్న గణనాథులు. నిర్వాహకులు పోటాపోటీగా చూపరులను అబ్బురపరిచే విధంగా డెకరేషన్, కలర్ ఫుల్ లైటింగ్స్ తో అత్యంత సుందరంగా మండపాలను ముస్తాబు చేశారు. ఇదివరకే కొన్ని విగ్రహాలు మండపాలకు చేరుకున్నాయి. నేటి రాత్రి వరకు అయా గ్రామాలకు గణేష్ విగ్రహాలు చేరుకోనున్నాయి. పట్టణ, గ్రామాల్లో, కాక ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో గణేష్ విగ్రహాలను ప్రతిష్టిస్తున్నారు. గణేష్ ఉత్సవాలు ముగిసే వరకు గణేష్ భక్తి గీతాలు మార్మోగనున్నాయి. పూజ,అలంకరణ సామాగ్రి, పూలు, పండ్ల దుకాణాల అమ్మకాలు జోరుగా సాగాయి. గణేష్ విగ్రహ తయారీ కేంద్రాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. కలిసొచ్చిన ఆదివారం సెలవు రోజు కావడంతో యువకులు మండపాల ఏర్పాట్లలో నిమగ్నమై బిజీబిజీగా కానవచ్చారు.

## మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి అరెస్టును సరికాదు..

- **మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి**



**గండీడ్,సెప్టెంబర్ 13 (జనంసాక్షి):** పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేయడం అప్రజాస్వామికమని మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పరిగి బస్టాండ్ వద్ద కాల్లాపూర్,రాకొండ గ్రామాల రైతులు తమ భూములను ఇండస్ట్రియల్ పార్కుల కోసం ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వబోమంటూ చేపట్టిన ఆందోళనకు మద్దతు తెలిపేందుకు వెళ్లిన మహేష్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేసి కుల్కచర్ల పోలీస్‌స్టేషన్‌కు తరలించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. రైతుల భూముల విషయం లో ప్రభుత్వం తక్షణమే స్పష్టత ఇవ్వాలని,అరెస్టు చేసిన నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## కరెంట్ బిల్లులు తగ్గించుకోవాలంటే సోలార్ ఉత్తమం



**సంగారెడ్డి, సెప్టెంబర్ 13 (జనంసాక్షి):** విద్యుత్ ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించాలని కాంగ్రెస్ నాయకుడు జగ్గారెడ్డి అన్నారు. సంగారెడ్డిలో భారత్ ఈవీ సోలార్ లిమిటెడ్ బ్రాంచ్ కార్యాలయాన్ని ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ పెరుగుతున్న విద్యుత్ అవసరాల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ సోలార్ విద్యుత్ వ్యవస్థల వైపు దృష్టి సారించాలని సూచించారు. గృహ అవసరాల కోసం సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసుకునే వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీ అందిస్తున్నాయని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కంపెనీ డిస్ట్రిబ్యూటర్లు ప్రసాద్, కళ్యాణ్ మాట్లాడుతూ భారత్ ఈవీ సోలార్ లిమిటెడ్ ద్వారా 1 నుంచి 10 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ యూనిట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అర్హులైన వినియోగదారులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం సబ్సిడీ ప్రయోజనాలు లభిస్తాయని పేర్కొన్నారు. సంగారెడ్డి బ్రాంచ్ ద్వారా స్థానికులకు సోలార్ విద్యుత్‌పై అవగాహన, సలహాలు, సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ హఫీజ్, కాంగ్రెస్ నాయకులు కూన సంతోష్, రమేష్, కంపెనీ ప్రతినిధులు, డిస్ట్రిబ్యూటర్లు పాల్గొన్నారు.

## 286 మందికి రూ.65.60 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు



**సిద్దిపేట బ్యూరో, సెప్టెంబర్ 13 (జనంసాక్షి):** సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 286 మందికి రూ.65.60 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆదివారం పంపిణీ చేశారు. వివిధ కారణాలతో ఆసుపత్రుల్లో చికిత్స పొందిన వారికి సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. లబ్ధిదారులు చెక్కులను వెంటనే బ్యాంకుల్లో జమ చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. బీఆర్ఎస్ హయాంలో సిద్దిపేటలో గుంతలు లేని రోడ్లు ఉండేవని, ప్రస్తుతం రోడ్లన్నీ గుంతలమయంగా మారాయని ఆరోపించారు. 24 గంటల విద్యుత్ హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం ఆరు గంటలకే పరిమితం చేసిందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందుల కొరతతో ప్రజలు బయట కొనుగోలు చేస్తున్నారని, కేసీఆర్ కిట్‌ను నిలిపివేశారని విమర్శించారు. వెయ్యి పడకల ఆసుపత్రి, శిల్పారామం పనులు నిలిచిపోయాయని, వెటర్నరీ కళాశాలను తరలించారని ఆరోపించారు. సాగునీరు అందక రంగనాయకసాగర్ ఎండిపోతోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందని, కేసీఆర్ మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. వచ్చే రోజుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడి సిద్దిపేట అభివృద్ధిని మళ్లీ పరుగులు పెట్టిస్తుందని హరీశ్‌రావు పేర్కొన్నారు. ప్రజల ఆదరణను ఎల్లప్పుడూ గుండెల్లో పెట్టుకుని సేవ చేస్తానని తెలిపారు.

## సిద్దిపేటలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం: పూజల హరికృష్ణ



**సిద్దిపేట బ్యూరో, సెప్టెంబర్ 13 (జనంసాక్షి):** రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో సిద్దిపేటలోని 43 వార్డుల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేసి మున్సిపల్ చైర్మన్ పీఠం కైవసం చేసుకుంటామని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. పట్టణంలోని 2వ వార్డులో ఆదివారం పార్టీ జెండాను ఆవిష్కరించి, లబ్ధిదారులతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం నిర్వహించారు. అనంతరం అర్హులకు స్మార్ట్ రేషన్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ పాలనలో సంక్షేమ పథకాలు అర్హులకు కాకుండా పార్టీ నాయకులు, కార్యకర్తలకు దక్కాయని, పనులకు లంచాలు తీసుకున్నారని ఆరోపించారు. తాను ఎన్నికల్లో ఓడినా ప్రజల మధ్యే ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నానన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలనలో అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు నేరుగా అందుతున్నాయని తెలిపారు. సిద్దిపేట నియోజకవర్గానికి తొలి విడతలో 3,500, రెండో విడతలో మరో 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని చెప్పారు. గత ప్రభుత్వం పదేళ్లలో రేషన్ కార్డులు ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులకు స్మార్ట్ రేషన్ కార్డులు అందిస్తోందన్నారు. 2వ వార్డు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ప్రజలు కోరగా, సమస్యలను మంత్రి వివేక్ వెంకటస్వామి దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.